సాక్షి
ములుగు

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



వరంగల్‌లో హరియాణా మందు

వరంగల్‌లో హరియాణా నుంచి తెచ్చిన మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు.

- 8లో ▸



ప్రమాదకరంగా కల్వర్టులు

మల్హర్ మండలంలోని మల్లారం ఆరెవాగు కల్వర్టు, కొయ్యూరు నాగులమ్మ సమీపంలోని ప్రాంతంలోని బొగ్గుల వాగు కల్వర్టు, కొయ్యూరు పరిసర ప్రాంతంలోని రోడ్డం లోలెవల్ కల్వర్టు ప్రమాదకరంగా మారాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6° /22.7°

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్‌పై వాహన తనిఖీలు



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహన తనిఖీలను నిర్వహించారు. 163 నంబర్ జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. వాహనాల్లోని బ్యాగులను పరిశీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసు కున్నారు.

పొక్లెయిన్, లారీ దగ్ధం



ఏటూరునాగారం: మండల పరిధిలోని రామన్నగూడెం నుంచి పప్కాపురం వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న కరకట్ట రోడ్డుపై నుంచి ఓ లారీలో పొక్లెయిన్ తీసుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి పొక్లెయిన్, లారీ గురువారం దగ్ధమైనట్లు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రామన్నగూడెం వద్ద జరిగిన కరకట్ట పనులకు వచ్చి పనులు ముగించుకొని హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో పొక్లెయిన్ 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో లారీకి మంటలు అంటుకున్న విషయాన్ని గమనించిన డ్రైవర్ వెంకటేశ్ లారీ దిగి కొంతదూరం పరుగెత్తాడు. దీంతో లారీ, పొక్లెయిన్ దగ్ధమైంది.

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి



ములుగు: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మండల పరిధిలోని మాన్‌సింగ్ తండాలో గురువారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయ పద్ధతిలో మొలకెత్తిన నారును తలపై పెట్టుకుని వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం తస్లీమా మాట్లాడుతూ గిరిజనులు నియమ నిష్టలు జరుపుకునే పండుగ తీజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో యువతులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించాలి



గణపురం: రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ భూములను వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ సందర్శించారు. అనంతరం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ రైతులు పత్తి పంటలో ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవ్‌రావు మాట్లాడుతూ మిరపనారు మళ్లలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్ వారు రూపొందించిన మినీ భూసార పరీక్ష కిట్‌ను పరుశరాంపల్లి గ్రామంలో రైతులకు భూసార పరీక్ష ఆవశ్యకత, రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూమిలో ఉండే, ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పంటల సాగులో పెట్టే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అయిలయ్య, విస్తరణ అధికారి ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



తమ్ముళ్లకు రాఖీ కడుతున్న సింధూజ



సోదరుడికి రాఖీలు కడుతూ..





అల్లెం అప్పయ్యకు రాఖీ కడుతున్న సోదరి



ఘనంగా రక్షా బంధన్

జిల్లా వ్యాప్తంగా రక్షా బంధన్ వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరులకు రాఖీ కట్టి సోదరీమణులు ఆశీర్వదించారు. హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే సీతక్క రాఖీ కట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పార్టీ కార్యకర్తలు, గన్‌మెన్, పీఆర్‌ఓకు రాఖీకట్టారు. డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్యకు ఆయన సోదరి రాఖీ కట్టారు. మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ జాకారంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రాఖీ కట్టారు. ప్రయాణికుల రాకపోకలతో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది.

– ములుగు

‘భగీరథ’ బాధలు

పైపులైన్ల లీకేజీలతో వృథాగా తాగునీరు

- కలుషితం అవుతున్నా పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో పలుచోట్ల అసంపూర్తి పనులు

మంగపేట: జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నీరుగారుతోంది. పథకం ప్రారంభించి ఏడేళ్లు కావస్తున్నా నేటికీ పలు గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్ని చోట్ల పైపులైన్ల లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితం అవుతోంది. మండల పరిధిలోని కొత్తూరు మొట్లగూడెం, తిమ్మాపురం గ్రామాలకు నేటి వరకు తాగునీరు సరఫరా కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ అధికారులు జీపీ, మండల పరిషత్ నిధులను ఖర్చు చేసి గతంలో ఉన్న బోరుబావుల ద్వారా నీటిని డైరెక్ట్ పంపింగ్ సిస్టం ద్వారా సరఫరా చేస్తున్నారు.

లీకేజీలతో తాగునీరు కలుషితం

కమలాపురంలోని వాటర్ గ్రిడ్ నుంచి గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటి సరఫరా జరిగే మెయిన్ పైపులైన్లతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి గ్రామాల్లోని ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసిన పైపులైన్ల నుంచి నీరు లీకేజీ అవుతోంది. ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఏర్పడడంతో వాటర్ గ్రిడ్‌లలో లక్షల రూపాయల ఖర్చుతో శుద్ధి చేసిన తాగునీరు కలుషితం అవుతోంది. అదే నీటిని కొందరు తాగునీటికి వినియోగిస్తుండగా పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. మరికొంతమంది కలుషిత నీటిని తాగలేక రోజు వారి అవసరాలకు వినియోగిస్తున్నారు. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న గుత్తేదారుల్లో కొందరు అధికార పార్టీ నాయకులు కావడంతో పాటు మరి కొందరు కమీషన్లు తీసుకుని పనులను బినామీలకు అప్పజెప్పి చేతులు దులుపుకోవడంతో పనులు పూర్తికావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంకా పనులుచోట్ల పూర్తి కాకపోవడం గమనార్హం.



కమలాపురంలోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(గ్రిడ్)



కోమటిపల్లి క్రాస్ వద్ద పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ



గొరారంవాగుపై లీకేజీకి కట్టిన ప్లాస్టిక్ కవర్

మంగపేట, కమలాపురంలో పూర్తికాని పనులు

మంగపేట మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలకు తాగునీటిని సరఫరా చేసేందుకు పాతవి 30 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులతో పాటు మరో 50 ట్యాంకులను నూతనంగా నిర్మించారు. మండల వ్యాప్తంగా 13,000 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అత్యధిక జనాభా కలిగిన జీపీలు మంగపేట, కమలాపురంలో మిషన్ భగీరథ పనులు పూర్తి స్థాయిలో పూర్తి కాలేదు. దీంతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండల పరిషత్, డీఎంఎఫ్‌టీ గ్రాంటు ప్రత్యేక నిధులతో వివిధ గ్రామాల్లో బోరుబావుల నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటుకు సుమారు రూ.25 లక్షలకు పైగా వెచ్చించారు. ఈ సమస్య ఒక్క మంగపేటలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా నెలకొని ఉంది. ఈ విషయంపై మిషన్ భగీరథ డీఈ సంధ్యారాణి, ఏఈ రాంచరణ్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

జిల్లా వివరాలు

ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు :	376
గతంలో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు :	217
పైపులైన్ నిర్మాణం (కిలోమీటర్లు):	1196.536
ఇంటింటి నల్లా కనెక్షన్లు:	87,239

చుక్క నీరు రాలే..



ఆరేళ్ల క్రితం భగీరథ పైపులైన్ వేసి నల్లా బిగించి వెళ్లారు. గోదావరి నీటిని శుభ్రం చేసి శుద్ధ జలాలుగా మార్చి ఇస్తామని తెలిపారు. మాటలు చెప్పి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ఒక్క చుక్క నీరు రాలేదు. అయినా పట్టించుకునేవారు లేరు. గ్రామానికి పక్కనే ఉన్న ముసలమ్మవాగులో చెలిమెల ద్వార నీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నాం.

- కొమరం పాపమ్మ, తిమ్మాపురం, మంగపేట

ప్రజా ప్రతినిధులు లేరు.. పట్టించుకోని అధికారులు



మండల పరిధిలో ప్రజా ప్రతినిధులు లేరు. మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తంగా మారడంతో తాగునీరు అందటం లేదు. తక్షణమే కలెక్టర్ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

- నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, తుడుందెబ్బ జిల్లా నాయకుడు, మల్లూరు



తాత ఫొటోకు రాఖీ

వాజేడు: మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన ఆశ్రీజ గురువారం తాత ఫొటోకు రాఖీ కట్టింది. బతికున్నప్పుడు తాతకు ప్రతీ సంవత్సరం రాఖీ కట్టేదని మనుమరాలు ఆశ్రీజ తెలిపారు. తాత మృతి చెందడంతో ఫొటోకు రాఖీ కట్టి తాతపై ఉన్న అభిమానాన్ని చాటింది.

మంత్రులను కలిసిన లక్ష్మీనరసింహారావు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్ష్మీనరసింహారావు

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన లక్ష్మీనరసింహారావు గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావును మంత్రి హరీశ్‌రావు అభినందించారు. ములుగు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు అందరూ కలిసి పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో మహిళలు, బాలికలకు రక్షణ

ఎస్పీ గాష్‌ఆలం

ములుగు: షీటీమ్స్‌తో మహిళలు, బాలికలకు రక్షణ ఉంటుందని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్స్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 27 హాట్‌స్పాట్లను గుర్తించి షీ టీమ్ బృందాలు 60 సార్లు సందర్శించి 21 పర్యాయాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న షీటీమ్స్ బృందాలు పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పోక్స్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌లపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో షీటీమ్స్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలను అందిస్తాయన్నారు. షీ టీమ్ ఫిర్యాదు క్యూఆర్ కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడే క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు అన్ని ప్రాంతాల్లో అతికించి ఉన్నాయని తెలిపారు. వేధింపులకు గురయ్యే మహిళలు షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయదలిచే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 100కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండకుండానే వివాహం చేసుకుంటున్నట్లుగా తెలిస్తే 1098కు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో షీటీమ్స్ బృందాలు పనిచేస్తాయని వివరించారు. షీటీమ్ సిబ్బందిగా సీఐ దయాకర్, ఎస్సై మౌనిక, సిబ్బంది మధు, అలేఖ్య, చైతన్య, సింధూజ విధులు నిర్వహిస్తారని తెలిపారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీఐల చూపు ‘అర్బన్’ వైపు!

- లాంగ్ స్టాండింగ్‌లను తప్పించేందుకు సీఎం పేషీ నుంచి సిఫార్సులు
- సస్పెండైనా.. హనుమకొండ స్టేషన్‌పైనే గురి

కాజీపేట అర్బన్: ఆబ్కారీ శాఖలో మల్టీజోన్ పరిధిలో ఎక్సైజ్ సీఐలుగా పదోన్నతి పొందిన ఎస్సైలు సీఐ సీటు దక్కించుకునేందుకు ఏకంగా సీఎం పేషీ నుంచి సిఫార్సులతో విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 16 నెలల క్రితం మల్టీజోన్ విభజనలో భాగంగా 28 మంది ఎస్సైలు సీఐలుగా పదోన్నతి పొందారు. అయినప్పటికీ సీఐ సీట్లు ఖాళీలు లేని కారణంగా కొన్ని నెలలు అదే స్టేషన్‌లో ఎస్సైలుగా కొనసాగారు. కాగా.. రెండు నెలల క్రితం చెక్‌పోస్ట్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో ఆబ్కారీ శాఖ వారిని సర్దుబాటు చేసింది.

అర్బన్‌పై ఆశలు!

హనుమకొండ, కాజీపేట, వరంగల్ అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్‌స్టేషన్ల వైపు చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సీఐల చూపుపడింది. కాజీపేటకు నెల క్రితం సీఐ బదిలీపై వచ్చారు. దీంతో హనుమకొండ, అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్లలోని సీఐల సీటుపై నజర్ వేసినా.. పదోన్నతి పొందిన సీఐలు ఏకంగా సీఎం పేషీ నుంచి, స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని పోస్టింగ్ లెటర్లను సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.



లాంగ్ స్టాండింగ్‌లకు ఎఫెక్ట్

వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లలో సీఐలు ఆరేళ్లుగా అదే స్టేషన్లలో కొనసాగుతున్నారు. దీంతో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న సీఐలను తప్పించి తమకు పోస్టింగ్ ఇప్పించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ పదోన్నతి పొందిన సీఐలు ప్రదక్షిణలు చేస్తున్నారు. వరంగల్ అర్బన్ పరిధి ఎక్సైజ్ స్టేషన్ల సీఐలకు సీటు గండం పొంచి ఉంది.

సస్పెండైనా.. హనుమకొండ వైపు

గతంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెండై ఇటీవల పదోన్నతి పొందిన ఓ సీఐ హనుమకొండ ఎక్సైజ్‌స్టేషన్‌పై కన్నేశారు. పోస్టింగ్ సాధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. నెల క్రితం బదిలీపై వచ్చిన కాజీపేట సీఐని తప్పించేందుకు సీఎం పేషీ నుంచి సిఫారసు లెటర్‌ను తెచ్చుకున్నారు. కాగా.. కాజీపేట సీఐ లాంగ్ స్టాండింగ్ కాదు.. ఫ్రెష్‌గా బదిలీపై వచ్చినట్లు ఉన్నతాధికారులు వివరణ ఇచ్చి పోస్టింగ్ నిలిపివేసినట్లు సమాచారం.

సింగరేణి కార్మికులకు ఎరియర్స్ చెల్లించాలి

భూపాలపల్లి రూరల్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఎరియర్స్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు పసునూటి రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు సమస్య పరిష్కారమై నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఎరియర్స్ చెల్లించడం లేదన్నారు. త్వరలో పంపిణీచేసే పేమెంటుతోపాటు ఎరియర్స్ చెల్లించాలన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో దంత వైద్యుడిని, జనరల్ ఫిజీషియన్ డాక్టర్‌ను, చెస్ట్, గుండె వైద్యనిపుణులను నియమించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు డ్యూటీకి అవసరం ఉన్న సమయంలో తాము తెచ్చుకున్న సామానుల భద్రత కోసం బాక్సులు ఇవ్వాలని కోరారు. ఓసీపీ–2లో ఓల్వోలతో పోసే బొగ్గును ప్రైవేట్ వారితో కాకుండా సింగరేణి డ్రైవర్లతోనే నడిపించాలని జీఎంకు విన్నవించారు. మోరంచపల్లి, వెంకటేశ్వర్లపల్లి, కొండాయి, మల్యాల వరద బాధితుల కోసం ఒక్కో కార్మికుడి నుంచి వసూలు చేసిన రూ.వెయ్యి బాధితులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు నంది జనార్దన్, నాయకులు బొర్ర రాంబాబు, నాగరాజు, రంజిత్, వీరకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

‘మావోయిస్టుల కరపత్రాలు పడలేదు’

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో ఆగస్టు 29న మావోయిస్టుల కర పత్రాలు పడలేదని వెంకటాపురం(కె) సీఐ బండారు కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎవరో కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని హెచ్చరించారు.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

భూపాలపల్లి అర్బన్: సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, ప్రధాన కార్యదర్శి కుర్రె ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు నెలవారి పదోన్నతులు ఉండేవని రెండు సంవత్సరాలకు ఒకసారి బదిలీలు జరిగేవని చివరగా 2015లో కూడా బదిలీలు, పదోన్నతులు జరిగాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంటి ఇప్పటివరకు పదోన్నతులు లేవన్నారు. 2018లో బదిలీలు మాత్రమే చేపట్టి ఆ తర్వాత 2021లో రాష్ట్రపతి ఆదేశాలకు 317 ఉత్తర్వుల ద్వారా 33 జిల్లాలలో ఉపాధ్యాయుల కేటాయింపు చేపట్టిందన్నారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. బదిలీల కటాఫ్ ఆగస్టు 31వరకు తీసుకోవాలని, మిగిలిన ఖాళీల కోసం కొత్త నియామకాలు చేపట్టినట్లయితే ఉపాధ్యాయుల కొరతతో సతమతమవుతున్న ఈ మారుమూల జిల్లాకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. సంఘం బాధ్యులకు ఇచ్చే పాయింట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



గోదావరి హారతి

కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం త్రివేణి సంగమ గోదావరికి గురువారం గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.మహేష్, ఆలయ ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, శ్యామ్‌సుందర్‌దేవా, ప్రశాంత్ రెడ్డి, కలికోట దేవేందర్, ఓదేటి పద్మ, బండి రాజయ్య, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

- కాళేశ్వరం

పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలి

కాటారం: కాటారం మండలం ప్రతాపగిరి, గొంతెమ్మ గుట్టలను పర్యాటకకేంద్రాలుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు మహేష్ రవీందర్ రావు, జాడి మహేశ్వరి, కోఆప్షన్ సభ్యుడు అజీజ్ కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కలెక్టర్‌ను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కలిసి ప్రతాపగిరిగుట్ట, గొంతెమ్మ గుట్టల విశిష్టతను వివరించారు. గుట్టపై దేవతామూర్తుల ఆనవాళ్లు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ తెలిపారు.

క్లుప్తంగా

రౌడీషీటర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో బుధవారం రౌడీషీటర్ ఎస్‌డీ నజీర్ (37) దారుణ హత్యకు గురయ్యాడు.ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో హత్య చేసి రైలులో పరారైన నిందితుల గురించి ఆరా తీస్తున్నారు. హత్యలో ఎంత మంది భాగస్వాములయ్యారు..? రైలు ఎక్కిఎటు వైపు పారిపోయారు..? ఎందుకు హతమార్చాల్సి వచ్చిందనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. హత్య ప్రదేశంలో లభ్యమైన సీసీ ఫుటేజీల ఆధారంగా కూడా నిందితుల వివరాలు ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తోంది. హత్య చేసి పరారవుతున్న క్రమంలో రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి ఇప్పటికే చిక్కినట్లు సమాచారం. కేసును త్వరగా ఛేదించడానికి ఇప్పటికే మిల్స్‌కాలనీ పోలీసులు రైల్వే పోలీసు అధికారుల సహకారం తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచార ప్రకారం నిందితులు రైలు ఎక్కి ఉత్తర్‌ప్రదేశ్‌కు పరారవుతుండగా రైల్వే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను వరంగల్‌కు తీసుకొచ్చేందుకు స్థానిక పోలీసులు వెళ్లినట్లు సమాచారం. నిందితులను శుక్రవారం సాయంత్రం వరకు వరంగల్ తీసుకొచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మునావర్ దేవ్ సింగ్ (ఫైల్)

కురవి: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మునావర్ దేవ్‌సింగ్(45)కు ఎకరంన్నర భూమి ఉంది. గతేడాది ఎకరం భూమిలో మిరప తోట సాగు చేశాడు. చేతికొచ్చే సమయంలో నల్లిరోగంతో పంట ఎండిపోయింది. దీంతో పంట కోసం చేసిన అప్పులు పెరిగాయి. అప్పులు తీరక మనస్తాపానికి గురైన ఆయన.. బుధవారం రాత్రి పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటినా మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. మృతుడికి భార్య కళ, ఇద్దరు కుమారులున్నారు.

అనురాగం.. ఆప్యాయత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైభవంగా రాఖీ పౌర్ణమి

రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు రాఖీ కడుతున్న తన చెల్లెలు అనంత లక్ష్మి



దోర్నకల్ : ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు బొట్టు పెడుతున్న ఆయన సోదరి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క



వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి మునిగాల సరోజన



అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల ప్రేమానురాగాలు ప్రతీక రాఖీ. ఈ పండుగ వెలకట్టలేని.. వదులు కోలేని మమతానురాగాలకు ప్రతిరూపం. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సోదరిమణులు తమ సోదరులకు రాఖీ కట్టి రక్తసంబంధాన్ని చాటిచెబుతారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడపడుచులు తమ తోబుట్టువులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకున్నారు. అనంతరం అన్నదమ్ములు.. అక్కాచెల్లెళ్లకు తమకు తోచిన విధంగా కానుకలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, ఆడపడుచుల రాకతో ఆయా కుటుంబాల్లో సందడి నెలకొంది. అలాగే, గ్రామాలు, పట్టణాలు కళకళాడాయి.


బ్రహ్మకుమారీస్ రక్షా బంధన్ వేడుకల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు


కమలాపూర్ : బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు రాఖీ కడుతున్న సోదరి నీలమ్మ


హనుమకొండలోని నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు


హైదరాబాద్‌లో రాఖీ కట్టిన జనగామ మహిళా ప్రతినిధులకు భోజనం వడ్డిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


ఎమ్మెల్సీ 'కడియం'కు రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు విజయ


నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ దార్ల రమాదేవి


భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మహిళలు


ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ


మరిపెడ మండలం ఎల్లంపేటలో తన అన్న రవిచంద్రకు రాఖీ కడుతున్న చెల్లెలు, మహబూబాబాద్ ఎంపీ కవిత

వెల్లివిరిసిన మతసామరస్యం..

- ముస్లింకు 23 ఏళ్లుగా రాఖీ కడుతున్న హిందూ యువతి..


మహమూద్‌కు రాఖీ కడుతున్న శిరీష

కాజీపేట : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిక రాఖీ. ఈ పండుగకు కుల, మతాలతో సంబంధం లేదు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. కాజీపేట పట్టణానికి చెందిన ముస్లిం యువకుడు మహమూద్‌కు హిందూ యువతి శిరీష 23 సంవత్సరాలుగా రాఖీ కడుతోంది. చిన్నప్పటి నుంచే ఇరువురి కుటుంబాలకు మంచి సంబంధ బాంధ్యవ్యాలు ఉండేవి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం పండుగ సందర్భంగా శిరీష.. మహమూద్‌కు రాఖీ కడుతోంది. పెళ్లయినా భర్త వినయ్‌తో వచ్చి రాఖీ కట్టి ఆప్యాయతను చాటుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం కూడా మహమూద్ ఇంటికి వచ్చిన శిరీష.. మరోసారి రాఖీ కట్టి సోదర భావం చాటుకుంది.

రేపు మెగా జాబ్‌మేళా

రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన క్యూఆర్ కోడ్

హన్మకొండ అర్బన్ : నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ఈనెల 2న (రేపు) టీఎస్‌కేసీ, డీఈఈటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ లేదా http://bit.y/3YNonUG లింక్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న వాగ్దేవి కళాశాల బస్సు
- తిమ్మాపురం క్రాస్ వద్ద ఘటన
- గోవిందరావు పేటలో విషాదం


ప్రమాద తీరును పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్ : సోదరితో రాఖీ కట్టించుకుని త్వరగా వచ్చేస్తానంటూ ఓ వ్యక్తి బైక్ తీసుకుని కొద్ది దూరం బయల్దేరాడు. ఇంతలోనే మృత్యువు అతడిని బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన గురువారం సాయంత్రం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై తిమ్మాపురం క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ములుగు జిల్లా గోవిందరావు పేటకు చెందిన కంచర్ల విజయ్‌కుమార్(36) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే లోడ్‌తో వరంగల్‌కు వచ్చాడు. వరంగల్ హంటర్ రోడ్డులో లారీని పార్కింగ్ చేశాడు. రాఖీ కట్టుకుని ఇప్పుడే వస్తానని క్లీనర్‌కు చెప్పి గంజు నర్సయ్య అనే వ్యక్తి బైక్ తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద మామునూరు నుంచి వరంగల్ వైపునకు విద్యార్థులతో బయలుదేరిన వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల బస్సు అతివేగంతో బైక్‌ను ఢీకొంది. దీంతో విజయ్‌కుమార్‌కు తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రమోద్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీమున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

లైంగికదాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

నెల్లికుదురు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించి బాధితురాలికి రూ.4 లక్షల సాయం అందిస్తూ పోక్సో కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి పి.చంద్రశేఖర ప్రసాద్ తీర్పు ఇచ్చారని ఎస్సై కె.క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జాదు తండాకు చెందిన గుగులోతు లచ్చిరాం గత సంవత్సరంలో ఓ బాలికపై సామూహిక లైంగికదాడి కేసులో అప్పటి ఎస్సై పి.జితేందర్ పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి తొర్రూరు డీఎస్పీ రఘు సాక్ష్యాధారాలు సేకరించి చార్జీషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లా న్యాయ స్థానం లచ్చిరాంకు 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితునికి శిక్షపడేలా చేసిన పీపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు పోలీసు అధికారులను ఎస్పీ చంద్రమోహన్ అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

కొడుకు గొంతు కోసి హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మండలంలోని ఆలేరుకు చెందిన జనగాం నరేష్ తన భార్య మౌనికపై అనుమానంతో కొడుకు నవదీప్ గొంతుపై కత్తితో కోయగా గాయమైంది. దీనిపై మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్‌లో 'హరియాణ' మందు..

- అక్కడ తక్కువ ధరకు కొని.. ఇక్కడ ఎక్కువకు విక్రయం
- స్కూల్ బ్యాగుల్లో తీసుకొస్తున్న అక్రమార్కులు
- గుర్గావ్ నుంచి రైలు మార్గం ద్వారా వరంగల్‌కు చేరవేత
- ఆపై ఇంట్లోనే విక్రయం.. రైల్వే స్టేషన్‌లో పోలీసులకు చిక్కిన వ్యక్తి
- 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్లు స్వాధీనం


హరియాణ మద్యంతో పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్‌లో హరియాణ లిక్కర్ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి రైలుమార్గం ద్వారా వరంగల్ తరలిస్తున్నారు. అనంతరం ఇంట్లోనే యథేచ్ఛగా మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వరంగల్ పోలీసులు గురువారం వరంగల్ తుమ్మలకుంటకు చెందిన మనగాని గోవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. గోవింద్ ఎప్పటిలాగే హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్ (ఐఎంఎఫ్ ఎల్) బాటిళ్లను స్కూల్ బ్యాగులో తీసుకుని రైలు మార్గం ద్వారా వరంగల్ చేరుకున్నాడు. ఇంటికి వెళ్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్ గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అనంతరం రూ.56,720 విలువైన 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

రేటు రెట్టింపు...

హరియాణ ప్రభుత్వం ఇటీవల మద్యం ధరలను సడలించింది. ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్‌ను తగ్గించడంతో ఇతర రాష్ట్రాల కంటే అక్కడే తక్కువ ధరకు లభిస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్కడ మద్యం కొనుగోలు చేసి వరంగల్ తీసుకొచ్చి ఎక్కువ ధరకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. ఈ కోవలోనే మనగాని గోవింద్ కూడా హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి అక్కడి నుంచి బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్69 ఫుల్ బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. అక్కడ బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిల్ రూ.680 ఉండగా ఇక్కడ రూ.1320కు, రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్ రూ.400 ఉండగా ఇక్కడ రూ.860, వ్యాట్ 69 ఫుల్ బాటిల్ రూ.2,000 ఉండగా ఇక్కడ రూ.3,800 కు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఇతనే కాకుండా చాలా మంది హరియాణ, రైల్వే పోలీసుల కనుగప్పి ఈ లిక్కర్ అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో నగర పోలీసులు నిఘా పెంచారు. ఈ నేపథ్యంలోనే ఇంతేజార్‌గంజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన గోవింద్‌ను తనిఖీ చేశారు. ఇందులో తన బ్యాగులో లిక్కర్ లభించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్ఐ నర్సింహతోపాటు ఇంతేజార్‌గంజ్ పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని భర్త పట్టించుకోవడం లేదని..

- వివాహిత ఆత్మహత్య
- నార్లవాయిలో ఘటన


నాగమణి(ఫైల్)

సంగెం: మద్యానికి బానిసైన భర్త.. ఇంటి బాగోగులు చూడడంలేదని, ఎంత చెప్పినా మారడం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నార్లవాయి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన చిలువేరు జానుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు ఝాన్సీని సంగెం మండలంలోని నార్లవాయికి చెందిన యువకుడితో వివాహం జరిపించాడు. చిన్న కూతురు నాగమణి(23) అక్క ఇంటికి వచ్చిపోతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మొలుగూరి ప్రదీప్‌తో పరిచయం ఏర్పడింది. 5 సంవత్సరాల క్రితం ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి లోకేష్(4), స్నేహ(2) ఉన్నారు. ఈ క్రమంలో ప్రదీప్ ఏమి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబం బాగోగులు పట్టించుకోవడం లేదు. దీనిపై భర్తకు ఎంత చెప్పినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన నాగమణి.. ఆగస్టు 31వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తండ్రి జాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. భరత్ తెలిపారు.

బస్సులో బ్యాగు మరిచిన మహిళ..


బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న పరకాల పోలీసులు

పరకాల: తన సోదరుడికి రాఖీ కట్టాలనే ఆరాటంలో ఓ మహిళ బస్సులోనే బ్యాగు మరిచిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఈ విషయం గమనించి పరకాల పోలీసులను ఆశ్రయించింది. వారు స్పందించి వివరాలు సేకరించిన అనంతరం హనుమకొండ బస్‌స్టేషన్‌లో బ్యాగు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేశారు. పరకాల సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కోయల్ కార్ బీనా బాయ్ తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద సోదరుడి వద్దకు వెళ్లి రాఖీ కట్టింది. తిరిగి శాయంపేటలో ఉంటున్న మరో సోదరుడికి రాఖీ కట్టేందుకు హనుమకొండ బస్టాండ్‌కు చేరకుంది. అక్కడ భూపాలపల్లి డిపో బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మందారిపేట స్టేజీ వద్ద దిగి పిల్లలతో కలిసి సోదరుడి ఇంటికి వెళ్తుతుండగా బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె.. పరకాల పోలీసులను ఆశ్రయించింది. బ్యాగులో దుస్తులతో పాటు మూడున్నర తులాల బంగారం ఉన్నట్లు తెలిపింది. దీంతో పరకాల సీఐ వెంకటరత్నం సీసీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు బ్లూకోర్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. చివరకు భూపాలపల్లి డిపో అధికారుల ద్వారా సంబంధిత బస్సు కండక్టర్ వివరాలు తెలుసుకుని ఫోన్ చేయడంతో అయన బ్యాగు బస్సులోనే ఉన్నట్లు తెలిపారు. పోలీసులు వెంటనే హనుమకొండ బస్సు స్టేషన్‌కు చేరకొని బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్న బాధితురాలు పరకాల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

రెండు కుటుంబాల్లో 'పొగగొట్టం' చిచ్చు..

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ మధ్యకోటలో ఇంటిపై ఉన్న పొగగొట్టం రెండు కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. నా ఇంటిపై పొగ వస్తుందటే పట్టించుకోవా.. అంటూ ఓ వ్యక్తి పక్కటింటి వారితో గొడవ పడ్డారు. గొడవ పెద్దగా మారింది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఇంటిపైనున్న పొగగొట్టాన్ని ఎట్టకేలకు తొలిగించారు. దీంతో ఆగ్రహంతో ఇరువురు ఘర్షణ పడగా మహిళ చెందిన ఇంటి డోర్లును ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దూడల సంరక్షణతోనే.. 'పాడి' వృద్ధి

- రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి
- పాడిపరిశ్రమతో అధిక లాభాలు
- మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి


ఆవు దూడలు

కాజీపేట: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే దూడల సంరక్షణే కీలకమని, వీటి పెంపకంపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మడికొండ పశు వైద్యాధికారి కరుణాకర్ రెడ్డి తెలిపారు. దూడల పెంపకంపై శ్రద్ధ వహిస్తే అధిక లాభాలు పొందొచ్చన్నారు. దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'సాక్షి' తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పెంపకమే కీలకం..

దూడలు పుట్టినప్పటి నుంచి ఎదకు వచ్చే వరకు వాటిని కంటికి రెప్పాలా కాపాడుకోవాలి. దూడలు బలంగా, ఆరోగ్యంగా ఉండేలా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన దూడకు వెంటనే జున్నుపాలు తాగించాలి. దీంతో దూడలో వ్యాధి నిరోధక శక్తి పెరిగేతే, భవిష్యత్‌లో వాటికి వ్యాధులు సోకకుండా, ఆరోగ్యంగా ఉంటాయి. అయితే అవగాహనా రాహిత్యంతో కొంతమంది రైతులు పాడి పశువుల నుంచి మొత్తం పాలు పితుకుతారు. దీంతో దూడ పాలు సరిపోక నీరసించి, వ్యాధి నిరోధక శక్తి కోల్పోతుంది. అనంతరం వ్యాధుల బారిన పడి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అందుకే రైతులు దూడలకు సరిపడా పాలు అందేలా జాగ్రత్త వహించాలి.

దూడలకు వ్యాప్తి చెందే వ్యాధులు..

దూడల సంరక్షణలో వాటికి పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఇతరత్రా వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా దూడలకు అతిసార, తెల్లపారుడు, న్యుమోనియా, రక్తవిరోచనాలు, కీళ్ల నొప్పులు, బొడ్డువాపు వ్యాధులతో పాటు ఇతరత్రా వ్యాధులు, పరాన్న జీవులతో వ్యాప్తి చెందుతాయి. దూడలు ఎలాంటి రోగాల బారిన పడకుండా చక్కగా పెరిగితే రైతుకు ఆదాయమే. వీటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

మడికొండ పరిధిలో..

మడికొండ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం తదితర పనుల నిర్వహణకు తగినంత సాగునీరు లేకపోవడంతో రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో పాడిపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. దీంతోపాటు వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పులయ్యేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి తేరుకున్న ఈ ప్రాంత రైతులు పాడిపై దృష్టి సారిస్తూ లాభాలు పొందుతున్నారు. ప్రారంభంలో ఒకటి, రెండు ఆవులను కొనుగోలు చేసి పాడిని ప్రాంభిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఉదయం, సాయంత్రం కొద్ది సమయం పాడి పశువుల కోసం సమయం కేటాయిస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పటికే ఆవులను కొనుగోలు చేసి, పాడితో లాభాలు పొందుతున్న రైతులను గమనిస్తున్న ఇతర రైతులూ పాడి ఆవులను కొనుగోలు చేసి పాడి పరిశ్రమపై ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నారు. దూడలను కాపాడుకుంటూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి ..

పాడి రైతులు పుట్టిన దూడల పెంపకంపై జాగ్రత్త వహించకుండా పాలిచ్చే ఆవులపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. లేగదూడలు పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బొడ్డు కోసే సమయంలోనూ జాగ్రత్త అవసరం. లేగదూడల వయసును బట్టి అవి బలిష్టంగా పెరిగేందుకు సరిపడ పాలు మిగల్చడం ఎంతో ముఖ్యం. దూడలు ఆరోగ్యంగా పెరిగితేనే భవిష్యత్తులో అధిక మొత్తంలో పాలు ఇస్తాయి. దీంతో పాటు పాడి ఆవుకు ఆరోగ్యరమైన సమస్యలు తలెత్తవు. పెంపకంలో ఎలాంటి అనుమానం తలెత్తిన వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించాలి. అనుమానాన్ని నివృత్తి చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలి. లేకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాడిపశువుల విషయంలో పరిశుభ్రత చాలా ముఖ్యమైందని పెంపకందారులు గుర్తించాలి.